నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 మహబూబ్‌నగర్, శనివారం 3 ఆగస్టు 2024
MAHABUBNAGAR NARAYANPET



పెద్దమందడి : నీరులేక వెలవెలబోతున్న దొడగుంటపల్లి ఊరచెరువు

# తడారుతోంది!

- జిల్లాలో పారని వాగులు, వంకలు
- ఖాళీ కుండల్లా మారిన చెరువులు, కుంటలు
- అదునుకు సాగు నీళ్లు అందేనా..?
- ఆశలన్నీ ఎంజీకేఎల్ఐ, భీమా ఎత్తిపోతలపైనే..
- నేడు హైదరాబాద్‌లో శివం సమావేశం

వనపర్తి, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఏ చెరువును చూసినా ఖాళీ కుండల్లా దర్శనమిస్తున్నాయి.. గత పక్షం రోజులకుపైగా జిల్లాలో వర్షాల ప్రభావం కనిపిస్తున్నా వాగులు.. వంకలు పారిన దాఖలాలు లేవు.. నామమాత్రంగా కూడా చెరువుల్లో నీరు చేరకపోవడంతో అన్ని బోసిపోయి కనిపిస్తున్నాయి.. ఆగస్టు నెలలోకి వచ్చినా అధికశాతం చెరువులన్నీ ఒట్టిపోయి కనిపిస్తున్నాయి.. కేవలం జూరాల ఆధారంగానే వానకాలం సాగు కొంతమేర ఆశలు కలిగిస్తున్నా.. ఎంజీకేఎల్ఐ, భీమా ఎత్తిపోతల పథకాల మీద ఆధారపడిన రైతులు అయోమయానికి గురవుతున్నారు.. ఎగువన కురిసిన వర్షాలకు నదుల్లో నీళ్లకు కొదవలేకున్నా.. జిల్లాలో అధికశాతం ఉన్న చెరువుల్లో మాత్రం చుక్క నీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

***భీమాలో-2లో 154 చెరువులుంటే..***

భీమా ప్రాజెక్టు-2 ద్వారా జిల్లాలోని 154 చెరువులకు నీరు చేరే అవకాశం ఉన్నది. అయితే ఎగువన కురిసిన వర్షాలకు కృష్ణమ్మ పరవళ్లతో ప్రాజెక్టులకు జలకళ వచ్చింది. ఇందులో భాగంగా గత పక్షం రోజుల నుంచి జూరాల ప్రాజెక్టు ఆధారంగా ఉన్న ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. వీటిలో భీమా ప్రాజెక్టు-2 ద్వారా చెరువులను నింపే ప్రక్రియ ఇటీవలే మొదలైంది. ఇప్పటి వరకు కేవలం 11చెరువులకు మాత్రమే నీరు చేరింది. మిగితా వాటికి క్రమంగా నీరు చేరుతున్నది. 8 మండలాల పరిధిలో భీమా-2 ద్వారా సుమారు 64 కిలో మీటర్ల మేర 27వ ప్యాకేజీ ద్వారా నీటి పంపిణీ కొనసాగనుంది. ఈ 27వ ప్యాకేజీతోపాటు 15, 16, 19 ప్యాకేజీల ద్వారాను నీటి సరఫరా కొనసాగాల్సి ఉన్నది. ఈ చెరువులన్నీ నిండాలంటే, కనీసం నెల రోజులకుపైగా పంపింగ్ చేస్తే తప్పా వాటిని నింపడం సాధ్యం కాదు.

***ఎంజీకేఎల్ఐలోనూ..***

జిల్లాలో అధికంగా ఎంజీకేఎల్ఐ ద్వారా వానకాలం పంటలు సాగు చేస్తారు. ఎంజీకేఎల్ఐ పరిధిలోని గుడిపల్లి రిజర్వాయర్ ద్వారా 29వ ప్యాకేజీ నుంచి వనపర్తి జిల్లాకు సాగునీరు అందుతుంది. అలాగే జొన్నలబొగుడ రిజర్వాయర్ ద్వారా 28వ ప్యాకేజీ నుంచి పసుపుల బ్రాంచి కెనాల్ (పీబీసీ) ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాల చెరువులకు సాగునీరందుతుంది. కేఎల్ఐ పరిధిలో జిల్లాలోని దాదాపు 175 చెరువులకు సాగునీరు అందాల్సి ఉంది. అంటే జిల్లా వ్యాప్తంగా మొత్తం 60వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. ఇటీవల మూడు రోజుల కిందట గుడిపల్లి నుంచి నీటి విడుదల కొనసాగుతుంది. ఇంకా ఇప్పటివరకు చెరువులు నిండిన దాఖలాలు లేవు. ఇంత పెద్ద మొత్తంలో చెరువులకు నీళ్లు రావాలంటే కనీసం 45 రోజులు పట్టే అవకాశం ఉంది. వర్షాలు అంతంతే ఉండటంతో అన్నదాతలు ఆశించినమేరకు వానకాలం పంటల సాగుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వర్షపాతాన్ని పరిశీలిస్తే.. జూన్‌లో 124.2 మి.మీ. ఉంటే, నార్మల్ వర్షపాతం 75.8 మి.మీ.గా నమోదు కాగా, పెద్దమందడి, గోపాల్‌పేట మండలాల్లో సాధారణ వర్షపాతం, పెబ్బేరులో తక్కువగా నమోదైంది. అలాగే జూలైలోనూ 224.1 మి.మీ. గా నమోదు కాగా, సాధారణం 143.9 మి.మీ.గా నమోదైంది. ఈ లెక్కన మెట్టపంటల సాగుకు జూన్, జూలైలో కురిసిన వర్షాలు అనుకూలంగా ఉన్నాయి. కానీ వరి సాగుకే ఆలస్యం అవుతున్నదని రైతులు ఆందోళనకు చెందుతున్నారు.

### మీటింగ్ తర్వాత కేటాయింపులు

ప్రతి ఏటా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటి విడుదల.. సాగుబడులకు సంబంధించి శనివారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ ఈఎన్సీ కార్యాలయంలో శివం(స్టేట్ లెవెల్ కమిటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ వాటర్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్) సమావేశం నిర్వహిస్తారు. ఇందులో చీఫ్ ఇంజినీర్లు, సీనియర్ ఇంజినీర్లు పాల్గొని ఏ ప్రాజెక్టు కింద ఎంత సాగు చేయాలన్న నిర్ణయాలు చేస్తారు. ఈ మేరకు ప్రాజెక్టుల్లో నీళ్లు సమృద్ధిగా ఉన్నందునా జూరాల కింద ఆయకట్టుకు ఎలాంటి ఢోకా ఉండదు. ఇక మిగిలిన ఎత్తిపోతల పథకాలపైనే సాధ్యాసాధ్యాలను పరిశీలించి శివం మీటింగ్‌లో ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. 15 రోజుల నుంచి భీమా ఎత్తిపోతల నుంచి నీటిని పారిస్తున్నట్లు నీటి పారుదల శాఖ వనపర్తి జిల్లా ఎస్ఈ సత్యశీలారెడ్డి తెలిపారు. కేఎల్ఐలోని గుడిపల్లి 29వ ప్యాకేజీ ద్వారా మూడ్రోజుల నుంచి నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఎత్తిపోతల పథకాలన్నింటినీ ప్రారంభించాం. పథకాల వారీగా ఎంతెంత సాగు చేయాలన్నది శివం మీటింగ్ తర్వాత వెల్లడిస్తామని చెప్పారు.

# సదువుచెప్పేటోళ్లు లేక..

- బువ్వబెట్టి ఇంటికి పంపింద్రు
- సీఎం సభకొస్తే మూడు కిలోమీటర్లు నడిపిచ్చింద్రు
- ఆవేదన వ్యక్తం చేసిన టీచర్లు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 2 : ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు వెళ్లేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి సభకు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 662మంది ఉపాధ్యాయులు మహబూబ్‌నగర్ బాలుర జూనియర్ కళాశాల నుంచి 14బస్సులు, జడ్చర్ల నుంచి ఒకబస్సు మొత్తం 15 బస్సుల్లో గురుకుల పాఠశాలలు, విద్యాలయాల నుంచి 9 మంది పీజీటీలు, జేఎల్‌లు, ప్రిన్సిపాళ్లు బయలుదేరి వెళ్లగా.. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల నుంచి 568 మంది ఉపాధ్యాయులు బయలుదేరి వెళ్లారు.

***పాఠాలు నిల్..***

జిల్లాలోని 17 మండలాల నుంచి 662 మంది ఉపాధ్యాయులు బయలుదేరి వెళ్లగా ఏకోపాధ్యాయ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలు, ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు సదువు చెప్పె సారోళ్లు లేకపోవడంతో అందుబాటులో ఉన్న సిబ్బంది చిన్నారులకు మధ్యాహ్న భోజనం పెట్టి ఇంటికి పంపించారు. చాలా చోట్లా ఇదే పరిస్థితులు నెలకొన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు.

***ఉపాధ్యాయులకు తప్పనితిప్పలు..***

ఎల్‌బీ స్టేడియంలో సీఎంతో ఉపాధ్యాయుల ముఖాముఖి ఉండడంతో పాలమూరు నుంచి బయలుదేరిన ఉపాధ్యాయులను మొదట ఎల్‌బీ స్టేడియం సమీపంలోనే బస్సుల్లో వదిలి వెళ్లారు. సభ ముగిశాక బస్సుల కోసం వచ్చిన ఉపాధ్యాయులకు చుక్కలు కన్పించాయి. తమ బస్సు ఎక్కడుందో తెలియకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇందిరాపార్కు, ఎన్టీఆర్ స్టేడియం వద్ద బస్సులు పార్కింగ్ ఉండడంతో ఉపాధ్యాయులంతా కాలికి పనిచెప్పక తప్పలేదు. సీఎం సభ సాయంత్రం 5గంటలకే ముగిసినా.. ఉపాధ్యాయులు ఎక్కాల్సిన బస్సులు మాత్రం రాత్రి 7:15గంటలైనా కదలలేదు. రాత్రి 7:20 గంటలకు ఇందిరా పార్కు నుంచి పాలమూరుకు బయలుదేరాయి.

***కాటన్ బాక్సుల్లో బిర్యానీ..***

సీఎం సభకు వెళ్లిన ఉపాధ్యాయులకు మార్గమధ్యలో టోల్‌గేట్ల వద్ద కాటన్‌బాక్సుల్లో తీసుకొచ్చిన బిర్యానీతోపాటు రెండు చపాతీలు, కూరగాయలు, స్వీట్స్‌తో కూడిన భోజనం, వాటర్ బాటిల్స్ అందించారు. సభ ముగిశాక సారోళ్లను ఎవరూ పట్టించుకోలేదని కొందరు వాపోయారు.

## మొబైల్ షాప్‌లో చోరీ

నాగర్‌కర్నూల్, ఆగస్టు 2 : నాగర్‌కర్నూల్ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ఎస్సీ కాంప్లెక్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి మొబైల్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. సీసీ పుటేజీ ఆధారంగా తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో చోరీ జరిగినట్లు బాధితుడు గుర్తించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. దుకాణంలో దాదాపు రూ.లక్ష చోరీ జరిగినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

## విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

తెలకపల్లి గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శుక్రవారం బాత్రూం అని వెళ్లిన విద్యార్థిని బట్టలు ఉతికే లిక్విడ్‌ను తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. గమనించిన విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వడంతో ఆమెను నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలియరాలేదు.

# అడుగంటిన ఆశలు

## పాలమూరులో ఒట్టిపోయిన చెరువులు

నారాయణపేటలోని యాంకి చెరువు



మహబూబ్‌నగర్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర సరిహద్దులో కృష్ణా, తుంగభద్ర నదులు పరవళ్లు తొక్కుతున్నా నీటిని పూర్తిస్థాయిలో పారించుకోలేని దుస్థితి.. సరైన సమయంలో నీటిని ఎత్తిపోసుకోకపోవడంతో చెరువులు, వాగులు ఒట్టి బోయాయి. దీంతో ఉమ్మడి జిల్లా రైతులు, ప్రజల ఆశలు అడుగంటాయి.

**నదులు ఉప్పొంగినా ప్రయోజనమేది..?**

కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానది ఉప్పొంగింది. ఈ సీజన్‌లో 48 గంటల్లోనే జూరాల డ్యాం, 12 రోజులకే శ్రీశైలం ప్రాజెక్టు నిండిందంటే ఎంత వేగంగా తరలివచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఎగువ నుంచి ఫుల్‌గా వరద జలాలు వస్తుండడంతో 40కిపైగా జూరాల గేట్ల ద్వారా నిత్యం 3 లక్షల క్యూ సెక్కులు దిగువకు అధికారులు విడుదల చేస్తు న్నారు. మరోవైపు తుంగభద్ర నదికి కూడా ఇదే స్థా యిలో వరద పొంగుతున్నది. రెండు నదుల సంగమంతో తీర ప్రాంతాలు జలకళను సంతరించు కుంటే ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**కేసీఆర్ సర్కారు ముందుగానే..**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కర్ణాటకలోని ఆల్మట్టి డ్యాం వద్ద నీటి విడుదల ప్రారంభం కాగానే ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాజెక్టులకు సాగునీటి విడుదలను ప్రారంభించేవారు. ఎగువ నుంచి వరద జూరాలకు చేరేలోపే భీమా ఫేజ్-1, ఫేజ్-2, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు పథకాలకు నీటిని ఎత్తిపోసేటోళ్లు.. వాటితో పాటు ఎత్తిపోతల పరిధిలో ఉన్న గొలుసుకట్టు చెరువులకు కాల్వలు, వాగుల ద్వారా నీటిని పారించేటోళ్లు.. జూరాల పూర్తి స్థాయిలో నిండగానే ఎంజీ కేఎల్ లిఫ్ట్ పంపులు ప్రారంభమ య్యేవి. అన్ని రిజర్వాయర్లను నింపు కొంటూ.. చెరువులకు నీరు చేరేది. నారాయణపేట జిల్లాలో సుమారు 250 చెరువులకు, జోగుళాంబ గద్వాల జిల్లాలో 400కుపైగా చెరు వులు, మహబూబ్‌నగర్ జిల్లాలో 110 చెరువులు, నాగర్‌కర్నూల్ జిల్లాలో మరో 400 చెరువులను, వనపర్తి జిల్లాలో ఇటు భీమా ఫేజ్-2, ద్వారా అటు జూరాల ఎడ మ కాల ద్వారా, ఎత్తిపోతల పథకాల ద్వారా 500 కుపైగా చెరువులను కృష్ణానది నీటితో నింపేవారు.

ధరూరు మండలం మన్నాపురం చెరువు



- కృష్ణా, తుంగభద్రకు వరదొచ్చినా పూర్తిస్థాయిలో నీటి విడుదలేదీ..?
- జూరాల నుంచి 3 లక్షలకుపైగా క్యూసెక్కులు దిగువకు..
- నీటి విడుదలపై దృష్టి సారించని కాంగ్రెస్ ప్రభుత్వం
- 10శాతం చెరువులకు సైతం చేరని జలాలు
- ప్రవాహం లేక వెలవెలబోతున్న దుందుభీ, కందూరు వాగులు
- ఆందోళన చెందుతున్న రైతులు

**ముందుచూపులేని ప్రభుత్వం**

కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో లక్షలాది క్యూసెక్కులు వృథాగా సముద్రం పాలవుతున్నది. నారాయణపేట జిల్లాలో ఉన్న భీమా ఫేజ్-1, గద్వాల జిల్లాలోని నెట్టెంపాడు, మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు ఆలస్యంగా నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఫలితంగా 20 రోజుల నుంచి జూరాల డ్యాం గేట్ల నుంచి వరద దిగువకు పారుతున్నా.. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఓపెన్ చేసినా.. మనం పూర్తిస్థాయిలో నీటిని సద్వినియోగం చేసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. చెరువులకు నీళ్లు మళ్లించడం మాత్రం పాలకులు మరిచారని ధ్వజమెత్తుతున్నారు. ఇప్పటికే ఈసారి వర్షాలు అంతంత మాత్రంగానే కురవడం.. ప్రాజెక్టులు నిండుగా పారుతున్నా చెరువులన్నీ బోసిపోయాయి. ఉమ్మడి జిల్లాలో పెద్దదైన దుందుభీ నది ప్రవాహం లేక ఎదురుచూస్తున్నది. అలాగే కళకళలాడే కందూరు వాగు పరిస్థితి అలాగే ఉన్నది. ముందుగానే నీటిని ఎత్తిపోసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ఉంటే వరద వృథాగా పోయేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముందుచూపుతో వ్యవహరించాల్సిన కాంగ్రెస్ సర్కారు మాత్రం చోద్యం చూస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వానకాలం సీజన్‌కు సాగునీటి రాక కష్టంగా మారింది. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే యాసంగి నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే అధికారులు మాత్రం రాష్ట్ర సర్కారు నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, అదంతా ప్రాసెస్ ప్రకారం చెరువులకు నీళ్లు వదులుతామని పేర్కొంటున్నారు. 20 రోజుల నుంచి లక్షలాది క్యూసెక్కుల నీరు సాగరం వైపు వెళ్తుంటే అధికారులు మాత్రం ఆదేశాల పేరుతో కాలయాజన చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కందనూలులో బోసిపోతున్న చెరువులు**

నాగర్‌కర్నూల్ జిల్లాలో చెరువుల్లో పూర్తిస్థాయిలో నీళ్లు ఎక్కడా కనిపించడం లేదు. మొత్తం 2 వేలకు పైగా చిన్నా, పెద్ద చెరువులు ఉన్నాయి. ఎంజీకేఎల్ ద్వారా ప్రతి సంవత్సరం నాలుగు వందలకుపైగా చెరువులను నీటితో నింపేవారు. ఈ వర్షాకాలంలో కురుస్తున్న వానలతో ఆశించిన మేర నీళ్లు చేరలేదు. చాలా వరకు చెరువుల్లో 50 శాతం నీరు కూడా చేరలేదు. గుడిపల్లి రిజర్వాయర్ ద్వారా గత వారం నీటిని విడుదల చేయడంతో ఇప్పుడిప్పుడే కాల్వల్లో నీరు చేరుతున్నది. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ ప్రాంతాల్లో చెరువుల్లోకి నీటి విడుదల ప్రారంభమైంది. అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాలకు ఇంకా చేరలేదు. శ్రీశైలానికి వరద భారీగా వస్తుండడం.. ఎంజీకేఎల్ పంపులు నడుస్తుండడంతో రాబోయే నెల రోజుల్లో చెరువుల్లోకి నీళ్లు చేరే అవకాశం ఉన్నది. దుందుభీ బోసిపోయింది.

**నీళ్లు వదులుతున్నామని చెబుతున్నా..**

కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల నుంచి కృష్ణానదికి భారీగా వరద చేరుతుండడంతో భీమా ఎత్తిపోతల ద్వారా మక్తల్ నియోజకవర్గంలోని భూత్పూర్, సంగంబండ, రామన్‌పాడు రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఊట్కూర్ మండలం మినహా కృష్ణ, మాగనూర్, మక్తల్, నర్వ, ఆత్మకూర్, అమరచింత మండలాల పరిధిలోని 150 గొలుసుకట్టు చెరువులకు రిజర్వాయర్ల ద్వారా నీరు చేరాల్సి ఉన్నది. వీటి పరిధిలో 1.20 లక్షల ఎకరాలకు నీరు అందాలి. భూత్పూర్ రిజర్వాయర్ 3.317 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నిండుకోగా ఇప్పటివరకు కాల్వల ద్వారా 50 శాతం చెరువులకు మాత్రమే సాగునీటిని వదులుతున్నామని చెబుతున్నా.. వాస్తవానికి అందుకు విరుద్ధంగా పరిస్థితి ఉన్నదని రైతులు చెబుతున్నారు. 2.317 టీఎంసీల సామర్థ్యం ఉన్న సంగంబండ రిజర్వాయర్‌కు ఆలస్యంగా నీటిని వదలడంతో ఇప్పటివరకు పూర్తిస్థాయిలో నిండక 1.317 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. ఈ రిజర్వాయర్ ద్వారా నర్వ, మక్తల్, మాగనూర్ చెరువులకు సాగునీటిని అందించకపోవడంతో ఆయకట్టు రైతులు వరి పంట సాగు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

**గద్వాల జిల్లాలో ఇదే పరిస్థితి..**

జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం చెరువులు 561 ఉన్నాయి. ఇందులో కొన్ని వర్షాధారంగా నిండేవి కాగా.. మరికొన్ని నెట్టెంపాడు ద్వారా వచ్చే నీటితో నిండనున్నాయి. అయితే ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో అన్ని చెరువులకు నీరు పారుతున్నది. ప్రస్తుతం రిజర్వాయర్ నుంచి కాల్వలకు విడుదల చేయడంతో చెరువుల్లోకి ఇప్పుడిప్పుడే వచ్చి చేరుతున్నది. ఆలంపూర్ నియోజకవర్గంలో ఆర్డీఎస్ కాల్వకు నీటిని విడుదల చేయడంతో అక్కడి నుంచి చెరువులకు పారుతున్నది. అంతేగానీ ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేకంగా చెరువులను నింపడం లేదని రైతులు పేర్కొంటున్నారు. నీరులేక ధరూర్ మండలం మన్నాపురం చెరువు ఎండిపోయింది. అలంపూర్ నియోజకవర్గంలో 64 చెరువులు ఉండగా అయిజ మండలం మినహా మిగతా ఏ మండలాల్లోని చెరువులకు నీరు చేరలేదు. రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో నీరు చేరే అవకాశం ఉన్నది.

**వారంలో నింపుతాం..**



వర్షాలు ఆశించిన స్థాయిలో కురకవపోడంతో రిజర్వాయర్ల కింద చెరువులకు సాగునీరు అందించడం ఆలస్యమవుతున్నది. భూత్పూరు రిజర్వాయర్ 3.317 టీఎంసీల పూర్తిస్థాయి సామర్థ్యంతో నిండింది. సంగంబండ రిజర్వార్‌కు ఒక టీఎంసీ నీళ్లు కావాల్సి ఉన్నది. యాభై శాతం కెనాల్ లింకింగ్ చెరువులకు సాగు నీటిని పంపింగ్ చేశాం. పూర్తిస్థాయిలో చెరువులు నిండేందుకు మరో వారం పట్టే అవకాశం ఉన్నది.

**- సంజీవ్ ప్రసాద్, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్, నీటిపారుదల శాఖ**

# ప్రతీకార పాలన నడుపుతుంద్రు

- అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలకు అవమానం
- రైతుబంధు నిలిపి రైతు రుణమాఫీ చేసింద్రు
- మీడియాతో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఆగస్టు 2 : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాపాలనకు బదులుగా ప్రతీకార (కక్ష సాధింపు) పాలన నడిపిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పసలేని బడ్జెట్ ను విడుదల చేసి పేదల నడ్డి విరుస్తున్నారని, అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను అవమాన పరుస్తున్నారని మండిపడ్డారు. రైతులు, ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి రైతులకు రైతుబంధు నిలిపివేసి రుణమాఫీ చేస్తున్నారన్నారు. రైతు రుణమాఫీ విషయంలో రేషన్‌కార్డు ప్రామాణికమని ఒకరు, మరోవిధంగా మరో మంత్రి మాట్లాడుతూ పొంతనలేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రేషన్‌కార్డులు ఉన్నవారికే రుణమాఫీ అని ఒకరు, లోన్‌కు ఇంట్రెస్టుకు సంబంధం పెట్టి కొర్రీలు పెడుతున్నారని, రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ తలలు పట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తశుద్ధి ఉంటే రైతుల రుణమాఫీ చేయాలే కానీ ఆంక్షల పేరిట రైతు పొట్టకొట్టొదన్నారు. ఆరు గ్యా రెంటీల పేరుతో అధికారంలో వచ్చిన ప్రభుత్వం అవి దిక్కులేకుండా పోయాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా ఏ ఒక్కటి సక్రమంగా అమలు కావడం లేదని, వందరోజుల్లో అమలు చేస్తామన్న హామీలన్నీ ఉత్తివే అయ్యాయన్నారు. మహిళలకు రూ.2500 ఎప్పుడిస్తారని, ముసలవ్వలకు రూ.4 వేల పింఛన్ ఎక్కడ అని, నిరుద్యోగ భృతి ఊసేలేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో లేవని, రోజుకు నాలుగు హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ఎన్నికల్లో మీరు ఇచ్చిన హామీలకు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, రైతు భరోసాపై ఇప్పటికీ సరైన విధి విధానాలు రూపొందించలేదని, పాలనను పక్కన పెట్టి ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను కొనే పనిలో పడ్డారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తలతిక్క ఆలోచనలు చేసి ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నారని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, రోజులు లెక్కపెట్టుకుంటున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును స్వాగతిస్తున్నామని, గొప్ప తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ ఉద్యమం నుంచే బీఆర్ఎస్ పోరాటం చేస్తున్నదని, ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ ఆనాడే ఎస్సీ వర్గీకరణ కోసం డిమాండ్ చేశారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి అసెంబ్లీ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపిన విషయం అందరికీ విధితమే అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చింది కాబట్టి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలం, పులేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవి, శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ దివ్య రూపం.. అద్భుతం

అలంపూర్, ఆగస్టు 2 : ఐదో శక్తి పీఠంగా విరాజిల్లుతున్న అలంపూర్ క్షేత్రంలో ఆషాఢమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని జోగుళాంబదేవి శాకాంబరి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూల విరాట్‌ను కూరగాయలు, పూలతో సర్వంగా సుందరంగా అలంకరించారు. అదేవిధంగా జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను కొబ్బరి మట్ట లు, మామిడి ఆకులు, పూల తోరణాలతో అలంకరించారు. మరో వైపు బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్రోత్సవం నిర్వహించా రు. శుక్రవారం తుంగభద్రానదీ తీరం భక్తులతో పులకించిపోయిం ది. సంధ్యా సమయంలో అమ్మవారి ఆలయంలో జోగుళాంబ సహిత బాలబ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు రథోత్సవం నిర్వహించారు.



శాకాంబరిగా జోగుళాంబ దేవీ

# రుణమాఫీ మా చావుకొచ్చింది

కొల్లాపూర్, ఆగస్టు 2 : రైతు రుణమాఫీ గందరగోళంతో రైతులు ఇక్కట్లు పడుతున్నారు. అర్హత ఉన్న రుణమాఫీ కానీ వారు రూ.లక్ష రుణమాఫీకి కేవలం పదివేలలోపు రుణమాఫీ అయిన వారు పంటల సీజన్‌లో పొలాలను బీడులుగా పెట్టుకొని బ్యాంకుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. తిండితిప్పలు మాని బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్న రైతుల పరిస్థితి దీనంగా ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని చాలా మంది రైతులకు ఆంక్షల పేరుతో రుణమాఫీకి టోకరా పెట్టారు. శుక్రవారం రుణమాఫీ కోసం వచ్చిన రైతులను సొసైటీ బ్యాంకులో సిబ్బంది రాకుండా గేట్లకు తాళాలు వేశారు. దీంతో మహిళలు, వృద్ధులు బ్యాంకులోకి వెళ్లేలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంత మంది రైతులు గోడలను దూకి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నం చేసి గాయాలపాలయ్యారు. మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన కౌడిశాలయ్య రైతు కొల్లాపూర్ సొసైటీ బ్యాంకులో రూ.50వేలు క్రాప్‌లోను తీసుకున్నాను. కానీ రుణమాఫీ లిస్టులో కేవలం రూ.13,050 మాత్రమే మాఫీ అయినట్లు లిస్టు వచ్చింది. ప్రభుత్వ ఆంక్షలతో భారీ ఎత్తున లబ్ధిదారులను వడబోతపోసినట్లు రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పేరుకు మాత్రమే రుణమాఫీ చేసిందని వాస్తవ పరిస్థితిలో రుణమాఫీ కానీ వారి సంఖ్య అధికంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మభ్యపెట్టి పది మంది రైతులకు రుణమాఫీ చేసి 90 మంది రైతులకు రుణమాఫీ చేయలేదని బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



కొల్లాపూర్ సొసైటీ బ్యాంకు సిబ్బంది గేట్లకు తాళం వేయడంతో గోడ దూకుతున్న రైతులు

### మూడ్రోజులుగా తిరుగుతున్నా..



రూ. 50వేల రుణ మాఫీలో రూ.13,050 మాత్రమే మాఫీ అయ్యింది. ఎందుకు ఇలా జరిగిందని తెలుసుకునేందుకు మూడు రోజుల నుంచి బ్యాంక్ చుట్టూ తిరుగుతున్నా. ఈ రోజు ప్రాణాలకు తెగించి బ్యాంకులోకి వెళ్లి అధికారులను అడిగితే చూస్తాం అని చెబుతున్నారు తప్పా రుణమాఫీ అవుతోందని మాత్రం చెప్పడం లేదు. ఏది ఏమైనా నాకు న్యాయం చేసి రుణమాఫీ చేయాలి.

**– కౌడిశాలయ్య, రైతు, చింతలపల్లి, కొల్లాపూర్ మండలం**

# మహబూబ్‌నగర్ కలెక్టర్ పేరుతో నకిలీ వాట్సాప్!

- చాటింగ్ చేసినట్లు సృష్టించిన సైబర్ నేరగాళ్లు

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 : సైబర్ నేరగా ళ్లు ఏకంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి పేరుతో నకిలీ వాట్సాప్ సృష్టించిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఆ వివరాలు ఇలా.. కలెక్టర్ విజయేందిరబోయి ఫొటోతో ఫేక్ వాట్సాప్ డీపీ సృష్టించి, సామాజిక మాధ్యమాల్లో కలెక్టర్ మాట్లాడుతున్నట్లు వాట్సాప్ చాటింగ్ చేసినట్లు సైబర్ నేరగాళ్లు చేస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ జానకి తెలిపారు. కలెక్టర్ పేరిట ఆమె ఫొటోతో ఫోన్ 94784605962 నెంబర్‌తో ఒక నకిలీ వాట్సాప్ అకౌంట్‌ను సృష్టించారని, ఈ నెంబర్‌తో ఉన్నతాధికారి పేరున ఫోన్ చేసినా, మెసేజ్‌లు పంపినా నమ్మవద్దని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.